క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొరిటిపాడు(గుంటూరు): విద్యుత్ మరమ్మతులు నిమిత్తం బుధవారం సరఫరా నిలిపివేయనున్నట్లు టీ-2 డీఈఈ ఎస్.గురవయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అంతరాయం ఉంటుందని చెప్పారు. శ్యామలా నగర్, సాయి నగర్, వికాస్ నగర్ జీరో లైను నుంచి 10వ లైన్ వరకు, లక్ష్మీనగర్, అన్నపూర్ణ నగర్ తూర్పు, హోసన్నా మందిర్ ఏరియా, లక్ష్మీపురం ప్రధాన రహదారి, వాటర్ వర్క్స్ ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

■ 11 కేవీ వెంకటాద్రిపేట ఫీడర్ మరమ్మతుల కారణంగా వెంకటాద్రిపేట, నెహ్రూనగర్ 9, 10, 11వ లైన్లలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీ-9 సెక్షన్ డీఈఈ పీహెచ్ ఖాన్ తెలిపారు.

■ విద్యుత్ లైన్ల మరమ్మత్తుల కారణంగా నల్లచెరువు పరిధిలోని ఎస్కేఆర్ ఎస్టేట్, సప్తగిరిఎస్టేట్, ఎన్హెచ్-5 సర్వీసు రోడ్, సూర్యదేవర ఎస్టేట్, పెట్రోల్ బంక్, నల్లచెరువు 10వ లైన్ నుంచి 19వ లైన్ వరకు, మూడు బొమ్మల సెంటర్, వివాహ్ కన్వెన్షన్ సెంటర్తదితర ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతోందని టీ-3 డీఈఈ బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

■ విద్యుత్ ఫీడర్ల మరమ్మతుల దృష్ట్యా బుధవారం సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్-1 డీఈఈ షేక్ ముస్తాక్ అహమ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు. డీ-3 సెక్షన్ పరిధిలోని 11 కేవీ ఏసీ కళాశాల ఫీడరు, దారియనగర్ హిందూ కాలేజీ రోడ్, డీ-1 సెక్షన్లో 11 కేవీ రెడ్ల బజారు ఫీడర్, కొరిటిపాడు రెడ్ల బజార్, డీ-10 సెక్షన్లో కేవీ 2వ ఫీడరు, లాంఛెస్టర్ రోడ్, సంగడిగుంట, ఆనందపేట, బారాయిమామ్ పంజా వినియోగదారులు సహకరించాలని కోరారు.

అవినీతిపై ఉద్యమించాలి



లక్ష్మీపురం: ఆనందకరమైన జీవనానికి అవసరమైన వనరులు, అవకాశాలు, న్యాయం వంటి వాటిని సామాన్య జనానికి అందుబాటులో లేకుండా చేస్తున్న అభివృద్ధిని కబలిస్తున్న అవినీతిని అంతం చేయాలని సీనియర్ అధ్యాపకులు సిహెచ్.సుబ్బారెడ్డి అన్నారు. అరండల్పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం అవినీతిపై చర్చ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అవినీతి నిరోధక చట్టాల దారుణవైఫల్యానికి ప్రతీకలుగా లంచావతారులు ప్రతి చోటా విజృంభిస్తూనే ఉన్నారన్నారు. జీవన సంధ్య అధ్యక్షుడు సి.కృష్ణారావు, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడారు.

కర్రసాములో ప్రతిభ చూపిన కేఎల్పీ స్కూల్ విద్యార్థులు



గుంటూరు ఎడ్యుకేషన్: అంతర్జాతీయ సిలంబం (కర్రసాము) పోటీల్లో డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపినట్లు పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ తెలిపారు. కోయంబత్తూరులో ఇటీవల పోటీలు నిర్వహించారు. మంగళవారం జేకేసీ కళాశాల రోడ్డులోని పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణప్రసాద్ మాట్లాడుతూ 5వ, 6వ తరగతి విద్యార్థులు ఎస్.వసంత, ఎస్. రేవంత్ సింగిల్స్లో బంగారు పతకం, స్పేరింగ్లో రజతం సాధించారని తెలిపారు. 3వ తరగతి విద్యార్థి జె. యుధిష్టర సింగిల్స్, స్పేరింగ్లలో రజతం, 9వ తరగతి విద్యార్థిని కె.తన్మయ, టెన్త్ విద్యార్థి డి.సూర్య రెండు విభాగాల్లోనూ రజత పతకాలు సాధించారని తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులతో పాటు కోచ్లు బి.కాశీనాథ్రెడ్డి, బి.వెంకట సాయి సుబ్రహ్మణ్యంలను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి. రత్తయ్య, ఏఓ కె.వెంకట్రావు, అకడమిక్ కో-ఆర్డినేటర్ బి.శైలజ పాల్గొన్నారు.

8న ప్రపంచ ప్రార్థనా దినోత్సవం

మంగళగిరి టౌన్: క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన ప్రపంచ ప్రార్థనా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఇమ్మానియేల్ చర్చి పాస్టర్ రవి ప్రకాష్ తెలిపారు. మంగళగిరి నగర పరిధి పార్కు రోడ్డులోని ఇమ్మానియేలు చర్చిలో మంగళవారం క్యాపిల్ రీజియన్ పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచ ప్రార్థనా దినోత్సవ కరపత్రాలను ఆవిష్కరించారు. రవిప్రకాష్ మాట్లాడుతూ.. టిప్పర్ల బజారులోని షాదీఖానాలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రపంచ ప్రార్థనా దినోత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రపంచ శాంతి, యుద్ధాలు, ఉగ్రవాద నిర్మూలన వివిధ అంశాలపై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో దైవ సేవకులు పిల్లి దయారత్నసాగర్, బేతాళ సాల్మన్ రాజు, మాతంగి భాస్కరరావు, అబ్రహం, శేఖర్బాబు, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

నవ్వుతో ఆరోగ్యం పదిలం

- లాఫింగ్ థెరపీలో నవ్వుల యోగా..
- గుంటూరులో లాఫింగ్ క్లబ్ 2005లో ప్రారంభం
- ఎన్టీఆర్ స్టేడియంలోఅ ప్రతి రోజు లాఫింగ్ యోగా



లాఫింగ్ యోగాలో భాగంగా నవ్వుతూ వ్యాయామం చేస్తున్న దృశ్యం

లక్ష్మీపురం: నవ్వు మనుషులను కలుపుతోంది. పుట్టుక నుంచి మనసుకు ఆనందాన్ని ఇస్తోంది. నవ్వుతో ఆరోగ్యం పండుతోంది. అందుకే నవ్వించడం యోగం.. నవ్వకపోవడం ఓ రోగం అన్నాడు ఓ మహాకవి. ప్రస్తుత బిజీ జీవనంలో నవ్వు మనిషికి దూరవుతోంది. ఈ నేపథ్యంలో కొందరు లాఫింగ్ క్లబ్లు ఏర్పాటు చేశారు. టైమ్ దొరికితే నవ్వుకోండి అంటూ ప్రచారం చేస్తున్నారు. నవ్వు వలన కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నారు.

లాఫింగ్ యోగా..

నవ్వు యోగా (లాఫింగ్ యోగా) అనేది లాఫింగ్ థెరపీలో ఒక రూపం, ఇది నవ్వును ఒక వ్యాయామంగా ఉపయోగించి శారీరక, మానసిక, మరియు భావోద్వేగ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఈ పద్ధతిని 1995లో డాక్టర్ మదన్ కటారియా, మధురి దంపతులు భారతదేశంలోని ముంబైలో అభివృద్ధి చేశారు.

ఎలా ప్రాక్టీస్ చేయాలి..

లాఫింగ్ యోగా క్లబ్లు లేదా సెషన్లలో పాల్గొనండి. భారతదేశంలో, అనేక నగరాలలో ఉచిత లాఫింగ్ యోగా సమూహాలు ఉన్నాయి. వ్యాయామాలు.. వార్మప్, క్లాపింగ్ మరియు 'హో హో, హా హా' అంటూ రిథమిక్ నవ్వు.'మిల్క్షేక్ నవ్వు' (ఒక గ్లాస్లో మిల్క్షేక్ కలిపినట్లు నటించడం) లేదా 'లయన్ నవ్వు' (సింహం లాంటి నవ్వు). ప్రతి నవ్వు సెషన్ తర్వాత లోతైన శ్వాస తీసుకునే విధంగా తర్ఫీదు ఇస్తారు.

ఒత్తిడి తగ్గింపు...

నవ్వు యోగా కార్టిసాల్ స్థాయిలను తగ్గిస్తుంది. అలాగే ఎండార్ఫిన్, డోపమైన్, సెరోటోనిన్ విడుదలను పెంచుతుంది. ఒక అధ్యయనం ప్రకారం, 8 వారాల నవ్వు యోగా సెషన్లు ఆందోళన, ఒత్తిడిని గణనీయంగా తగ్గిస్తాయి. నవ్వు యోగా ఇమ్యూనోగ్లోబులిన్ రోగనిరోధక శక్తి స్థాయిలను పెంచుతుంది. ఇది శ్వాసకోశ ఇన్ఫెక్షన్లను నిరోధిస్తుంది. ఒక అధ్యయనం ప్రకారం లాఫింగ్ యోగా రోగ నిరోధక కణాల కార్యకలాపాన్ని 20శాతం వరకు మెరుగుపరుస్తుంది. నవ్వు యోగా రక్త నాళాల విస్తరణను ప్రోత్సహిస్తుంది. రక్తపోటును తగ్గిస్తుంది. హైపర్టెన్షన్ ఉన్నవారిలో రక్తపోటును తగ్గిస్తుంది. రుమటాయిడ్ ఆర్థరైటిస్ రోగులలో నవ్వు యోగా నొప్పి స్థాయిలను 15 నుంచి 20 శాతం తగ్గించిందని వైద్యులు అంటున్నారు.

మానసిక ఆరోగ్యం..

నవ్వు యోగా డిప్రెషన్, ఆందోళన స్థాయిలను తగ్గిస్తుంది. నవ్వు యోగా మానసిక ఆరోగ్యంపై సానుకూల ప్రభావాన్ని చూపిస్తుంది. ముఖ్యంగా వృద్ధులలో, మానసిక రుగ్మతలు ఉన్నవారిలో బాగా ఉపయోగకరంగా ఉంటుంది. అలాగే శ్వాసకోశ ఆరోగ్యానికి సంబంధించి నవ్వు యోగాలోతైన శ్వాస వ్యాయామాలతో కలిపి ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని మెరుగుపరుస్తుంది. ఇది ఆస్తమా లేదా సీఓడీ ఉన్నవారిలో శ్వాస సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది.

అలవాటు చేసుకోవాలి



నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో క్లబ్ ప్రారంభించాం. సుమారు 20 లాఫింగ్ ఎక్సర్సైజ్లు చేస్తాం. చివరగా చిన్న, చిన్న ఎక్సర్సైజ్లు తల, కంటికి సంబంధించిన ఎక్సర్సైజ్లు చేసి ప్రార్థనతో ముగిస్తాం. ప్రతి రోజు ఉదయం 5.30 గంటల నుంచి 7 గంటల వరకు లాఫింగ్ యోగా క్లబ్లో అనే మంది మహిళలు, పురుషులు సుమారు 40 నుంచి 50 సంవత్సరాలు పైబడిన వారు ఈ క్లబ్లో వచ్చి లాఫింగ్ చేస్తారు. దీని ద్వారా ఇన్నర్ హ్యాపినెస్, బీపీ, షుగర్ అదుపులో ఉంటాయి. మానవ సంబంధాలు మేరుగుపడతాయి. ఒకసారి అలలవాటు చేసుకుంటే మీకు ఆరోగ్య సమస్యలు రానే రావు.

–లాల్ వజీర్, లాఫింగ్ యోగా వ్యవస్థాపక అధ్యక్షుడు, లాఫింగ్ క్లబ్ అధ్యక్షుడు

గ్రీన్ గుంటూరు పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మేయర్ రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూ నగర్: అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గ్రీన్ గుంటూరు లక్ష్యంగా నగరంలో 5 లక్షలు మొక్కలు నాటడానికి వార్డ్ సచివాలయాల వారీగా ప్రజలను భాగస్వాములను చేస్తామని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. ఈ నెల 5వ తేదీన అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణం, ప్లాస్టిక్ నిషేధంపై రూపొందించిన పోస్టర్ ఆవిష్కరణ కమిషనర్ చాంబర్లో మంగళవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న వన మహోత్సవం స్ఫూర్తితో నగరంలో ఆరోజు 25 వేలు నాటేలా, ఈ విధంగా మొత్తం 5 లక్షల మొక్కలు నాటేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని వివరించారు. నగరంలో ప్లాస్టిక్ సంచుల నిషేధంలో భాగంగా ప్రజలకు ప్రత్యామ్నాయంగా రూ.20లకే గుడ్డ సంచులను ఇచ్చే మెషిన్లను అందుబాటులోకి తీసుకురానున్నామని పేర్కొన్నారు. గుంటూరు నగరాన్ని క్లీన్, గ్రీన్ నగరంగా తీర్చిదిద్దుకోవడానికి మొక్కల పెంపకం, ప్లాస్టిక్ నిషేధం కీలకమని, ఆయా కార్యక్రమాల్లో నగర ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార, వాణిజ్య సంస్థలు సహకరించి, భాగస్వాములు కావాలని కోరారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియం దగ్గర చేపట్టే మెగా యోగాలో పాల్గొనే వారు యోగా మ్యాట్లతో హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డెప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, ఉపా సెల్ పీఓ రామారావు, ఐటీసీ నారాయణ, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

జాతీయస్థాయి సైన్స్ ఒలింపియాడ్లో విద్యార్థి ప్రతిభ



విద్యార్థిని అభినందిస్తున్న విష్ణువర్ధన్, కృష్ణవేణి

గుంటూరు ఎడ్యుకేషన్: యూనిఫైడ్ కౌన్సిల్ ఇటీవల నిర్వహించిన జాతీయస్థాయి సైన్స్ ఒలింపియాడ్లో శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న చదలవాడ శ్రీయాన్ కార్తికేయ అత్యుత్తమ ప్రతిభతో ఆంధ్రప్రదేశ్లో జోన్లో ప్రథమ స్థానంలో నిలిచినట్లు పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురం మెయిన్రోడ్డులోని పాఠశాలలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే విద్యార్థులు ఇటువంటి ప్రతిభా పాటవ పోటీల్లో పాల్గొనడం ద్వా సృజనాత్మక నైపుణ్యాలతో పాటు మేధకు పదును పెట్టవచ్చునని అన్నారు. ఈసందర్భంగా విద్యార్థిని అభినందించారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యుడు గింజపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి, సీనియర్ కో-ఆర్డినేటర్ దోసకాయల దుర్గాశ్యామ్ పాల్గొన్నారు.

లైసెన్స్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

కమిషనర్ పులి శ్రీనివాసులు



వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ పరిధిలో వార్డు సచివాలయాల వారీగా డీ అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్లపై ప్రత్యేక దృష్టి చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. కమిషనర్ అమరావతి రోడ్, నగరాలు, పాత గుంటూరు, బాలాజీ నగర్, ఐపీడీ కాలనీ తదితర ప్రాంతాల్లో మంగళవారం పర్యటించారు. ఆ ప్రాంతాల్లో ట్రేడ్ లైసెన్స్లు, పారిశుద్ధ్య పనులు, పూడికతీత పనులను పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రతి వ్యాపార, వాణిజ్య సంస్థ తప్పనిసరిగా నగరపాలక సంస్థ నుంచి డీ అండ్ ఓ ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలని చెప్పారు. వార్డు సచివాలయాల వారీగా శానిటేషన్ కార్యదర్శులు నూరు శాతం ట్రేడ్ లైసెన్స్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని, అలాగే ట్రేడ్ రెన్యువల్ ఫీజులు చెల్లించేలా చూడాలని ఆదేశించారు. రోడ్లు, డ్రెయిన్లను ఆక్రమణలు చేసుకొని, ట్రాఫిక్, మురుగు పారుదలకు అడ్డంకిగా ఉన్న వాటిని పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులు సమన్వయం చేసుకొని తొలగించాలని సూచించారు. వర్షాల వలన విరిగిన చెట్ల కొమ్మలు ఇంకా రోడ్ల పక్కన ఉంటున్నాయని, వాటిని తొలగించాలన్నారు. మేజర్ డ్రెయిన్లలో జరుగుతున్న పూడికతీత సమగ్రంగా జరిగేలా డీఈఈలు, ఈఈలు పర్యవేక్షణ చేయాలని, పూడికతీత అనంతరం మురుగు పారుదల పక్కాగా లేకుంటే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పర్యటనలో కార్పొరేటర్ సంకూరి శ్రీనివాసరావు, ఈఈ కోటేశ్వరరావు, డీఈఈ రమేష్ బాబు, ఎస్ఎస్లు రాంబాబు, సోమశేఖర్, ఏఈలు, టీపీఎస్లు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొనారు.

నేడు మెగా యోగా కార్యక్రమం

జూన్ 21వ తేదీన అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన యోగాంధ్ర 2025లో భాగంగా బుధవారం నగరపాలక సంస్థ పరిధిలోని ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం ఎదురు రోడ్లో మెగా యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికార యంత్రాంగ, స్వచ్ఛంద సంస్థలు, స్టేక్ హోల్డర్స్ పాల్గొంటారని చెప్పారు.

తాగునీటికి అర్ధరాత్రుళ్లు వేచిచూడాల్సిందే..

- స్థానికులను వెంటాడుతున్న మురుగునీటి సమస్య
- తూములను చదును చేయకపోవడంతో ఇక్కట్లు



ఎనిమిదో వీధిలో సైడు కాల్వలో నిలిచిన మురుగునీరు



రెండో వీధిలో కనిపించని సైడు కాల్వలు

డివిజన్	– 48
ఏరియా పేరు	– మదర్థెరిస్సా కాలనీ,
వీధులు	– తొమ్మిది
కుటుంబాల సంఖ్య: 500	

నగరంపాలెం: పాలకులకు కాలనీలపై చిన్నచూపు. నిర్ణీత వేళల్లో తాగునీరు వదలరు. ఒకవేళ సరఫరా చేసిన 200 లీటర్ల నీరు డ్రమ్లోకి చేరేసరికి కనీసం పావుగంట పడుతుంది. ఈ అలస్యంతో వందలాది కుటుంబాలకు మంచినీటికై ఇబ్బందులకు గురవుతున్నారు. మురుగునీటి వ్యవస్థ మరింత దారుణంగా మారింది. ఎక్కడికక్కడే మురుగు నిలిచి పోతుంది. కొన్ని చోట్ల రహదారులు అధ్వానంగా మారాయి. సుమారు 38–40 ఏళ్ల క్రితం కాలనీగా ఏర్పడిన, కనీస మౌలిక సౌకర్యాల కల్పనలో పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు.

రాకపోకలకు కష్టమే..

ఈ కాలనీలో అక్కడక్కడ సీసీ రోడ్లు, మిగతా చోట్ల మట్టి రోడ్లపైనే రాకపోకలు చేయాల్సి ఉంది. ఇక కాలనీలోకి రావాలన్నా, బయటకు పోయేందుకు ఐదో వీధి మీదగానే వెళ్లాల్సి వస్తోంది. నలభై అడుగుల విస్తీరణంలో ఉన్న ఈ రహదారి మిగతా ఎనిమిది వీధులు, అడ్డరోడ్లకు ఆయువు వంటిది. అయితే వందలాది కుటుంబాలకు నెలవైన ఈ రహదారి నిర్మాణంలో అలసత్వం ప్రదర్శిస్తున్నారు. గతంలో దాదాపు రూ.80 లక్షలతో సీసీ రోడ్డు, సైడు కాల్వలకు ప్రతిపాదనలు రూపొందించిన, ఆచరణలో కార్యరూపం దాల్చలేదు. అదిగాక తొమ్మిదో వీధిలో భూగర్భ డ్రెయిన్ పనులు నిమిత్తం తవ్వివదిలేశారు. ఆ రోడ్డుపై రాకపోకలు చేసే సమయంలో ఆ వీధిలో నివసించే స్థానికులు నెమ్మదిగా పోవాల్సిందే.. అడ్డరోడ్లు మరింత అధ్వానంగా మారాయి. మట్టిరోడ్లు కావడంతో రాకపోకలకు మరింత కష్టంగా ఉంటుందని స్థానికులు వాపోతున్నారు.

అరకొరగా తాగునీరు..

తాగునీటి సమస్య స్థానికులను వెక్కిరిస్తోంది. రాత్రి 11 తర్వాత మంచినీళ్లు సరఫరా చేస్తారు. కేవలం నాలుగు గంటలే వస్తాయని స్థానికులు తెలిపారు. అయితే ఇక్కడ నివసించే వారంతా దినసరి కూలీలే. ఉదయం పనులకెళ్తే సాయంత్రానికి ఇళ్లకు చేరతారు. ఇంట్లో పనులు ముగించుకుని, రాత్రి వేళల్లో నీటి కోసం వేచి ఉండాల్సిందే. దీంతో నిద్ర ఉండటంలేదని వాపోయారు.

తూములు దాటలేకపోతున్నాం..

ఈ ప్రాంత వాసులను మురుగునీటి సమస్య వెంటాడుతుంది. ఒకట్రెండు వీధులు, మిగతా అడ్డరోడ్ల ల్లో సరైన సైడు కాల్వల్లేవు. దీంతో ఇళ్లల్లోని నీరంతా అక్కడే నిలిచిపోతుంది. మురుగు ముందుకు కదలక నీరంతా నల్లగా మారింది. దానిపై దోమలు, ఈగలు వాలుతున్నాయి. వర్షకాలం వస్తే రోగా లు వస్తాయని భయంగా ఉందని వాపోతున్నారు. గతంలో స్థానిక ఎమ్మెల్యేకు, రెండు రోజుల క్రితం జీఎంసీ కమిషనర్కు వినతి పత్రం అందించినట్లు స్థానికులు తెలిపారు.

నీటి సరఫరాకు నిర్ణీత వేళ లేదు..



తాగునీటి సరఫరా సరిగ్గాలేదు. అర్ధరాత్రులు తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఒకవేళ సరఫరా అయిన అరకొరగానే ఉంటుంది. దీంతో నీటికి ఇబ్బందులు పడుతున్నాం. మురుగునీటి కోసం ఏర్పాటైన తూములు సరిగా నిర్మించలేదు. తూములు పైకి కనిపించడంతో ఆటోలు, ద్విచక్ర వాహనాలు మరమ్మతులకు గురవుతున్నాయి.

–జీవీఎస్మూర్తి, స్థానికుడు.

కాలువలు లేవు..



ఒకట్రెండు, మూడో వీధుల్లో సైడు కాలువలు లేవు. దీంతో ఇళ్లల్లోంచి వచ్చిన నీరంతా ఇళ్ల ఎదుటే నిలిచిపోతుంది. తద్వారా భరించలేని దుర్వాసన వెదజల్లుతుంది. రెండు, మూడు వీధుల్లోని చేతి పంపులు మొరాయించాయి. కనీసం తాగునీరు సరఫరా కాని వేళల్లో బోరు నీరైనా ఇంటి అవసరాలకు ఉపయోగపడతాయి.

–అల్లూరి వెంకటేశ్వర్లు, స్థానికుడు.

నగరంలో భైరవం చిత్రబృందం సందడి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నజీర్, చిత్రంలో నటులు రోహిత్, మనోజ్

నగరంపాలెం: నగరంలో భైరవం చిత్రబృందం మంగళవారం సందడి చేసింది. నటులు నారా రోహిత్, మంచు మనోజ్కుమార్, దర్శకుడు విజయ్ చిత్ర బృందం విజయోత్సవంలో భాగంగా కొత్తపేట పోలీస్స్టేషన్ సమీపంలోని భాస్కర్ సినిమాస్ థియేటర్ను సందర్శించారు. చిత్రం ఎలా అంటూ ప్రేక్షకులను అడిగారు. బాగుంది అని బదులిచ్చారు. మంచి విజయాన్ని అందించారని, ప్రేక్షకుల అభిరుచికి అనుగుణంగా కథలను ఎంపిక చేసుకుని, మంచి పాత్రలను పోషిస్తామని రోహిత్, మంచు మనోజ్ అన్నారు. ఎమ్మెల్యే నజీర్ మాట్లాడుతూ చాలా రోజుల తర్వాత మల్టీస్టార్ సినిమా రావడం సంతోషంగా ఉందన్నారు. సందేశంతో కూడిన చిత్రాన్ని అందించిన దర్శకుడిని అభినందిస్తున్నట్లు ఆయన అన్నారు. అనంతరం హీరోలను, దర్శకుడ్ని ఎమ్మెల్యే నజీర్, భాస్కర్ థియేటర్ యాజమాన్యం సత్కరించారు. పంపిణీదారులు, యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా షిరిడి సాయినాథుని మందిర వార్షిక బ్రహ్మోత్సవాలు



అభిషేకానికి బిందెలు తీసుకొస్తున్న భక్తులు

నగరంపాలెం: స్థానిక హౌసింగ్బోర్డుకాలనీ షిరిడి సాయినాథ మందిర వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం మంగళధ్వని, కాకడ హారతి, రుద్రనమకం చమకాలతో నిత్యాభిషేకం, అష్టోత్రం సహస్రనామ పూజలు వేద పండితులు చేపట్టారు. అనంతరం సత్సంగ సభ్యులు, భక్తులు 108 బిందెలతో బాబా వారికి అభిషేకం నిర్వహించారు. సాయంత్రం సాయం సంధ్య హారతి, సాయిచాలీసా, గురు చాలీసా భక్తి ప్రపత్తులతో జరిగాయి. వెంకటేశ్వర మహిళా కోలాట బృందం(జ్యోతి, కొప్పురావూరు) ఆధ్వర్యంలో కోలాట ప్రదర్శన భక్తులను అలరించింది. ఆలయ అధ్యక్షులు మామిడి సీతారామయ్య, ఉపాధ్యక్షులు మామిడి రామారావు పాల్గొన్నారు.

గోవధ నిషేధాన్ని కఠినంగా అమలు చేయాలి



గోరక్ష విభాగ్ ప్రతినిధులతో చలపతిరావు, శ్రీనివాసరెడ్డి, శ్రీనివాసరావు తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: బక్రీద్ సందర్భంగా గోవులను వధించకుండా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని విశ్వహిందూ పరిషత్ ఉత్తరాంధ్ర ప్రాంత గోసంరక్షణ సహ ప్రముఖ్ మన్నవ చలపతిరావు కోరారు. మంగళవారం పాత గుంటూరు, సంగడిగుంట, లాల్పురం, కేవీపీ కాలనీ ప్రాంతాల్లో వీహెచ్పీ కార్యకర్తలు, బ్రాహ్మణ సంఘాలు, స్వచ్ఛంద సంస్థలతో కలిసి పర్యటించారు. కార్యక్రమంలో గౌడ్ సంరక్షణ విభాగ్ జిల్లా ప్రముఖులు మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, దమ్మాలపాటి శ్రీనివాసరావు, ఆముదాల వెంకట్రావు, వీరంకి వీరబాబు, వి.సత్యనారాయణ, బుర్రి సుబ్బారావు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పట్నంబజారు: చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు.. మంగళగిరి కొత్తపేటకు చెందిన గోర్ల భరత్(39) టూరిస్టు డ్రైవర్గా పనిచేస్తుంటాడు. మే నెలలో 20 మంది టూరిస్టులను కాశీ తీసుకెళ్లి తిరిగి వస్తున్న సమయంలో ఒడిశా వద్ద ప్రమాదం చోటుచేసుకుంది. అక్కడి నుంచి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడి భార్య పేరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యేక హోదా ఆంధ్రుల సంజీవని

కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తులసిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

లక్ష్మీపురం: ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా సంజీవిని, హక్కు.. భిక్ష కాదు అని, విభజన చట్టంలో సెక్షన్ 46 కింద రాయలసీమకు, ఉత్తరాంధ్రకు బుందేల్ ఖండ్ తరహా ప్యాకేజీని కేంద్రం రాష్ట్రానికి ఇవ్వాలి కాని ఇవ్వలేదని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రాంతీయ పార్టీ ప్రభుత్వాలు రాష్ట్రానికి ద్రోహం చేశాయన్నారు. రాష్ట్ర విభజన సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం నవ్యాంధ్రప్రదేశ్కు ప్రత్యేక హోదా, ప్రత్యేక ప్యాకేజీ, విభజన చట్టంలో వివిధ సెక్షన్ల క్రింద షెడ్యూళ్ల కింద రూ.5 లక్షల కోట్ల మేరకు వరాలు ఇచ్చిందన్నారు. బీజేపీ వీటిని అమలుచేయలేదన్నారు. ప్రస్తుతం టీడీపీపై ఆధారపడి కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం మనుగడ సాగిస్తూ ఉంది. కనీసం ఇప్పుడైనా చట్ట ప్రకారం కేంద్రం నుంచి రాష్ట్రానికి రావలసిన వాటిని సాధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొరివి వినయ్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం పాల్ విజయ కుమార్, పార్టీ జిల్లా అధ్యక్షుడు చిలకా విజయ్కుమార్, ప్రధాన కార్యదర్శి బిళ్లా సునీల్, జొన్నా వెంకట్ రెడ్డి,జిల్లా ఎస్ఎస్యూఐ అధ్యక్షులు కరీం పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ వైఫల్యంపై ప్రశ్నించాలి

పట్నంబజారు: ఏడాది కూటమి పాలనలో ప్రజలను నిలువునా వంచించిన తీరుపై మేధావులు, విద్యావేత్తలు, ప్రతి ఒక్కరూ ఆలోచించి ప్రభుత్వ తీరును ఎండగట్టాల్సిన అవసరం ఉందని వైఎస్సార్ సీపీ ఇంటిలెక్చువల్ విభాగం జిల్లా అధ్యక్షుడు ఈమని రాఘవరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ప్రతి ఒక్కరికి తెలిసిన అంశమేనని, అధికారంలోకి వచ్చిన తరువాత ఏ ఒక్క హామీ అమలు చేయని అంశాన్ని గుర్తించాల్సిన అవసరం ఉందని చెప్పారు. 20214 నుంచి 2019 మధ్యలో కూడా కేవలం బూటకపు హామీలతో పాలన చేశారని, దానికంటే వందరెట్లు మోసపూరిత వాగ్దానాలతో 2024లో అధికారంలోకి వచ్చారన్నారు. పేదలు, మధ్యతరగతి ప్రజలను అన్ని విధాలుగా మోసం చేసి ఏ ఒక్క హామీ అమలు చేయకుండా దుర్మార్గపు చర్యలతో చంద్రబాబు సర్కార్ వ్యవహరిస్తుందన్నారు. దీనిపై పేద, మధ్యతరగతి వర్గాలేకాకుండా మేధావులు, విద్యావేత్తలు ప్రతి ఒక్కరూ కూటమి పాలన తీరును ప్రశ్నించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రశ్నించడం ద్వారానే కూటమి పాలనను నిలదీయడంతోపాటు, ప్రజలకు ఇచ్చిన దొంగ హామీలను తెలియజెప్పే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
(గుంటూరు ఈస్ట్)
90109 57733
Office mail : sakshigntadvt@gmail.com